క్లుప్తంగా

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ అనుబంధ రేగులపల్లి గ్రామంలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు గురువారం సాయంత్రం పోచమ్మ బోనాలు తీశారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పిల్లా పాపలను చల్లంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ సదన్‌కుమార్

ముస్తాబాద్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తిస్తున్నట్లు సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా లచ్చపేటకు చెందిన అనిల్ ముస్తాబాద్‌లో నెలరోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించారు. గురువారం సీఐ సదన్‌కుమార్ అనిల్‌కు సెల్‌ఫోన్ అందజేశారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, ఐటీ కానిస్టేబుల్ రాజశేఖర్ ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల పరిధిలో నాలుగునెలల్లో పోగొట్టుకున్న 52 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మండలంలోని అల్మాస్‌పూర్‌కు చెందిన వుచ్చిడి పవన్ ఫిబ్రవరి 21న సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ ద్వారా గుర్తించినట్లు గురువారం సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు తెలిపారు.

ఊపందుకున్న వరికోతలు

వీర్నపల్లి: మండలవ్యాప్తంగా వరికోతలు ఊపందుకున్నాయి. మబ్బులు కమ్ముకొస్తుండటంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

చెట్లను నరికేస్తున్నారు..



వీర్నపల్లి: మండలకేంద్రంలోని నీలగిరి చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. పర్యావరణాన్ని కాపాడటంతోపాటు పచ్చదనాన్ని పెంచాలనే ఉద్దేశంతో ఓ వైపు హరితహారం కార్యక్రమంలో మొక్కలు పెంచుతుండగా పెరిగిన చెట్లను నరుకుతూ అటవీప్రాంతాన్ని అన్యాక్రాంతం చేస్తున్నారు. అటవీశాఖ కార్యాలయానికి కిలోమీటర్ దూరంలో అటవీ ప్రాంతంలో అక్రమార్కులు నీలగిరి టేకు, ఇప్ప తదితర చెట్లను నరికి వేసి అటవీ ప్రాంతం నుంచి తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అదుపుతప్పితే.. అంతే!



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు వెళ్లే రహదారిలోని సాయిబాబా ఆలయం వద్ద రోడ్డు కిరువైపులా సైడ్‌వాల్స్ నిర్మించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సైడ్‌వాల్స్ నిర్మించి రక్షణ కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు, ముళ్ల పొదలను గ్రామస్తులు పంచాయతీ సిబ్బంది సహకారంతో తొలగించారు. రోడ్డు మధ్యలో డివైడర్ కూడా ఉండడంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో వాహనా లు అదుపుతప్పి రోడ్డుపక్కకు దూసుకెళ్లే అవకాశం ఉంది. రాత్రి వేళ ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ముస్తాబాద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బోయినపల్లి: తడగొండలో సందేశమిస్తున్న మతపెద్ద



తంగళ్లపల్లి మదీనా మసీదులో వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

ఈద్ ముబారక్

వేములవాడ/ వేములవాడ రూరల్/కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/తంగళ్లపల్లి / గంభీరా వుపేట/వీర్నపల్లి: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో రంజాన్ పర్వదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే చిన్నా, పెద్దా తేడా లేకుండా మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో మసీదులు, ఈద్గాల వద్ద సందడి నెలకొంది. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని పలువురు పేర్కొన్నారు. వేములవాడ బైపాస్ రోడ్డులోని ఈద్గాలో జరిగిన వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



గంభీరావుపేట : ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎల్లారెడ్డిపేటలో ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న తోట ఆగయ్య



వీర్నపల్లి: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కోనరావుపేట: బావుసాయిపేటలో ముస్లింల ప్రార్థనలు

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం



పరామర్శిస్తున్న రవీందర్‌రావు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో వివిధ కారణాలతో మృతిచెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. గొల్లపల్లికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అందె సురేశ్ తల్లి అందె రామవ్వ, మాజీ సర్పంచ్ పెంజర్ల శ్రీనివాస్ తల్లి, పెంజర్ల నారాయణ తండ్రి మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. ఇక్కడ మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్, రాగం ఎల్లయ్య, ఆంజనేయులు గౌడ్, పాశం దేవారెడ్డి తదితరులున్నారు.

నియామకం



లక్ష్మణ్

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల బీజేపీ వాణిజ్య సెల్ అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు నార్ల లక్ష్మణ్ గురువారం నియామకమయ్యారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మ్యాకల మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శి శ్రావణ్, బత్తిని స్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



వీర్నపల్లిలో పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు



చందుర్తిలో బీఆర్ఎస్ నాయకులు



ఎల్లారెడ్డిపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు



బోయినపల్లిలో పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



తంగళపల్లి : పెద్దలింగాపూర్‌లో..

పూలేకు నివాళి

సిరిసిల్లటౌన్/బోయినపల్లి/ వేములవాడ అర్బన్/ చందుర్తి/ వీర్నపల్లి/ ఎల్లారెడ్డిపేట/ తంగళ్లపల్లి : మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషిచేయాలని వక్తలు కొనియాడారు. జిల్లా కేంద్రంలో గురువారం పూలే జయంతిని నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో వేడుకల్లో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పాల్గొన్నారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ నేతృత్వంలో, బీవైనగర్‌లోని సీపీఎం కార్యాలయం, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో పూలే జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల టౌన్: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కొనుగోలు కేంద్రం ప్రారంభించేదెప్పుడో?



చందుర్తిలో ధాన్యం కొనుగోలు ప్రారంభించకపోవడంతో కుప్పలుపోసి కప్ప వేసిన రైతులు

- కుప్పలుగా పేరుకుపోయిన ధాన్యం రాశులు
- ఇబ్బంది పడుతున్న రైతులు

చందుర్తి: చందుర్తి సింగిల్‌విండో పరిధిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో అన్నదాతలు ధాన్యం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్‌విండో పరిధిలోని చందుర్తి, మల్యాల గ్రామాల్లో దళారులు ఇప్పటికే కొనుగోళ్లు ప్రారంభించారు. ప్రైవేటు వ్యాపారులు రూ.2,100 చెల్లిస్తున్నా.. సింగిల్‌విండో ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో దళారులకే విక్రయిస్తూ నష్టపోతున్నారు. కొందరు రైతులు మాత్రం ప్రభుత్వం బోనస్ ఇస్తే నష్టపోతామని భయంతో వ్యాపారులకు విక్రయించక కుప్పలుగా పోశారు. ఆకాశం మేఘావృతం అవుతుండడంతో తేమశాతం వచ్చిన ధాన్యం తడిసిపోతుందేమోననే భయాందోళన చెందుతున్నారు. చందుర్తి సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌పై పలు ఆరోపణలు వస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జాప్యానికి చైర్మన్ కారణమని చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా కొనుగోలు కేంద్రాల జా ప్యంపై ఎవరూ మాట్లాడకుండా ఉండేందుకు ఇటీవల డైరెక్టర్లకు విందు ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత సీజన్‌లో లాభాలు వచ్చాయని డైరెక్టర్లకు రూ.5వేల చొప్పున ముట్టజెప్పారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై చందుర్తి సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా రైస్‌మిల్లుల అలాట్‌మెంటు వచ్చిన వారు దింపుకునేందుకు నిరాకరిస్తున్నారని, అందుకే కేంద్రాల ప్రారంభానికి జ్యాపమవుతుందని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉండడంతో కేంద్రాల ప్రారంభం, నిర్వహణ సిబ్బంది చూసుకుంటున్నారని చెప్పారు. డైరెక్టర్లకు ఇచ్చిన డబ్బులు గత కొనుగోలు కేంద్రాల నిర్వహణకు అయిన ఖర్చులు అందజేసినట్లు తెలిపారు.

సౌకర్యాలు కల్పించండి..

వీర్నపల్లి: మండలంకేంద్రంతో పాటు మండలంలో పలు గ్రామాల్లో రోజూ రెండువేల మందికి పైగా కూలీలు ఉపాధి పనికి వెళ్తున్నారు. పనిచేసే ప్రదేశంలో వీరికి ఎలాంటి సౌకర్యం కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పని ప్రదేశంలో టార్పాలిన్‌తో నీడ కల్పించేవారు. కానీ ఈసారి మండుటెండలోనే పనిచేస్తూ ఇబ్బంది పడుతున్నారు. రోజూ మూడు నాలుగు గంటలపాటు ఎండలోనే పనిచేసినా కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. పని ప్రదేశంలో నీటి సౌకర్యం, కూలీలకు గాయాలైతే ప్రాథమిక చికిత్సకు సంబంధించిన మందులు ఉండేలా చూడాలని కోరుతున్నారు.



రోడ్డుపైనే మురుగు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి చౌరస్తా వద్ద కరీంనగర్ – సిరిసిల్ల రహదారిలో ఇళ్లు, హోటళ్లనుంచి వస్తున్న మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దీంతో ఈ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. నిత్యం రాకపోకలు సాగించే ఈ దారి గుండా మురుగుతోపాటు రోడ్డంతా గుంతలయమంగా మారింది. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి, ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మొగులు.. అన్నదాత దిగులు

- కల్లాల్లో పేరుకుపోతున్న ధాన్యం
- అకాలవర్షం పడితే తడిసిపోతుందోనని రైతులు ఆవేదన
- వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్

వేములవాడరూరల్: పండించిన పంటను విక్రయించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యాసంగి పంట చేతికొచ్చి కల్లాల వద్ద ధాన్యాన్ని ఆరబోసిన రైతులు కొనుగోలు ప్రారంభించకపోవడంతో అక్కడే జాగరణ చేస్తున్నారు. వేములవాడ మండలంతో పాటు ఇతర మండలాల్లో గత 15 రోజులుగా వరికోతలు జోరందుకున్నాయి. వేములవాడ మండలంలో సింగిల్‌విండో ద్వారా వరిధాన్యం కొనుగోళ్లు జరుపుతారు. ప్రతి సంవత్సరం అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం తూకం వేస్తారు. కానీ ఈ సంవత్సరం ఇప్పటివరకు వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో ధాన్యాన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కల్లాల వద్ద ఆరబోశారు. ధాన్యం తేమశాతం వచ్చినప్పటికీ సొసైటీ శాఖ మాత్రం ఇంకా కొనుగోళ్లు ప్రారంభించలేదు. గ్రామ శివారులో ధాన్యం ఆరబోయగా ఇంకా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు కల్లాల వద్ద పగలు, రాత్రి పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. రెండుమూడు రోజులుగా ఆకాశంలో మబ్బులు కమ్ముకొస్తుండటం, వాతావరణశాఖ హెచ్చరికలతో ధాన్యం తడిసిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ధాన్యం ఆరబోస్తున్న రైతు

15 రోజులవుతోంది



ధాన్యం తీసుకువచ్చి పదిహేను రోజులవుతోంది. ఇప్పటివరకు అధికారులు వచ్చి చూసింది లేదు. ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని ఎదురుచూస్తున్నాం. రోజూ ఆరబోసి మళ్లీ మబ్బులను చూసి కుప్ప పోయడం ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు ధాన్యం కొనుగోళ్లను త్వరగా ప్రారంభించాలి.

– ఒద్యారం రాజుకుమార్, రైతు, వట్టెంల

కల్లాల వద్దే ఉంటున్నాం



పది రోజుల నుంచి కల్లాల వద్దే పడిగాపులు కాస్తున్నాం. వర్షం పడితే ధాన్యం తడుస్తుంది. అయినా ఎవరూ రావడం లేదు. వెంట వెంట తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తే మిగతా రైతులకు ఇబ్బందులు తప్పుతాయి. అకాలవర్షం కురిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అధికారులు త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలి.

– గంగిపెల్లి చంద్రయ్య, రైతు, వట్టెంల